క్లుప్తంగా

కరాటే విద్యార్థులకు అభినందనలు



మహబూబ్‌నగర్ క్రీడలు: మక్తల్ పట్టణంలో ఆదివారం జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రానికి చెందిన డ్రాగన్ షోటోకాన్ కరాటేడూ స్పోర్ట్స్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు షోటోకాన్ అర్బన్ అధ్యక్షుడు మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. విద్యార్థులను సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో అభినందించారు. డ్రాగన్ షోటోకాన్ డూ స్పోర్ట్స్ ఫౌండర్ సాలం బిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, నిలేష్, రమేష్‌నాయక్, మధువీర్, రామచంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట

మహమ్మదాబాద్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ మండల ఇన్‌చార్జ్ శ్రీనాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలికల, బాలుర వసతి గృహాల్లో విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. నిర్వాహకులు సౌకర్యాలు కల్పించకుండా విద్యార్థుల కడుపు కొడుతున్నారని అన్నారు. బాత్‌రూం, మెస్ వంటి సౌకర్యాలు సరిగా లేవని, కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదని, నాణ్యమైన బోధన, భోజనం అందించడంలో విఫలమవుతున్నారని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ కూడా కరువైందన్నారు. ఇప్పటికైనా చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు మధు, రాము, మల్లేష్, రాఘవేందర్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

జవాబుదారీగా ఉండాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్
- అందరం జవాబుదారీగా ఉండాలి
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజాసేవ చేయడమే ముఖ్యమని, పదవులు ఉన్నా అవి శాశ్వతం కావని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణాల్లో, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రగతి భవన్‌లో ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారని వివరించారు. సోమవారం ఎంపీపీ సుధాశ్రీ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మొట్ట మొదటిసారి సమావేశానికి వచ్చిన ఆయనను పాలకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అంతా ఒకటే అనే భావన కలిగి ఉండాలని అన్నారు. గాజులపేట సర్పంచ్ చంద్రశేఖర్ తమ గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ఐదేళ్ల నుంచి అడుగుతున్నా ట్యాంకు మంజూరు చేయడం లేదని సభ దృష్టికి తెచ్చారు. వెంకటాపూర్ సర్పంచ్ మంగమ్మ గ్రామంలో పల్లె ప్రకృతి వనం స్థలం కబ్జా చేసి కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారని, నిలదీస్తే భౌతిక దాడులకు దిగుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రభుత్వానికి సంబంధించిన ఒక్క ఇంచు భూమి కూడా అన్యాక్రాంతం కారాదని, తక్షణమే అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రగతి నివేదికలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే.. విద్యాశాఖ సమర్పించిన నివేదిక సందర్భంగా పలు సూచనలు, సలహాలు చేశారు. మండలంలోని ఉన్నత పాఠశాలల సంఖ్యను, బాలికలకు ప్రత్యేకంగా కావాల్సిన టాయిలెట్లు, అలాగే తాగునీటి సౌకర్యం, అదనపు తరగతి గదుల అవసరం గురించి అడిగి తెలుసుకున్నారు. రేషన్ కార్డుల డిమాండ్ ప్రజల నుంచి అధికంగా ఉందని పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాల్లో తీర్మానం చేయాలని, ప్రభుత్వానికి ఆ తీర్మానం కాపీని అందించాలని ఎమ్మెల్యే సూచించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్, జెడ్పీటీసీ సభ్యురాలు పి.వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ కె.అనిత, సింగిల్ విండో చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లావోద్దీన్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మల్లు దేవేందర్‌రెడ్డి, తహసీల్దార్ సుందర్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను పరామర్శించిన నేతలు



పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్:/దేవరకద్ర: మాజీ సీఎం కేసీఆర్‌ను సోమవారం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య విషయంపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ ఆరోగ్యం బాగానే ఉందని ఆయన త్వరగా కోలుకోవాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు ఆల తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

పరిగి బస్సు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవాబుపేట: పరిగి నుంచి నవాబుపేట మీదుగా మహబూబ్‌నగర్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని మరికల్, బంగ్రపల్లి, అగ్రహారం గ్రామాల ప్రజలు డిపోమేనేజర్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం పరిగి డీఎం కరుణశ్రీని వారు కలిశారు. పరిగి నుంచి డబుల్ రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దామోదర్‌రెడ్డి, శివకుమార్, మధు, నరేంద్రప్రసాద్, మాదవులు, నర్సింహులు తదితరులు ఉన్నారు.

అసంపూర్తి పనులపై ఆరా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న పనుల గురించి, అలాగే కొత్తగా చేపట్టవలసిన పనులపై ఆరా తీశారు. నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి పరచడానికి అధికారులు పూర్తిగా సహకరించాలని కోరారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అందరు ముందుండాలని సూచించారు. సాగునీటి, తాగునీటి అవసరాలపై ఉన్న వనరులపై సమీక్ష చేపట్టారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మిషన్ భగీరథ, నీటి పారుదల, వైద్య ఆరోగ్య, విద్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

గండేడ్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారి ఆస్పత్రి ఖర్చులు భరించలేని స్థితిలో ఉన్న ఆటో డ్రైవర్‌కు రాష్ట్ర బీజేపీ నాయకులు వెన్నె ఈశ్వరప్ప సోమవారం రూ. 20వేల ఆర్థికసాయం అందించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు నర్సప్ప, బీజేపీ కేంద్ర ఇన్‌చార్జ్ భద్రేశ్వర్, కృష్ణయ్య, వెంకట్, రాములు, రాఘవేందర్, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని నెలలుగా స్థానిక బంగ్లగేరి చౌరస్తా సమీపంలోని నడిరోడ్డుపై రెండు చోట్ల మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. దీంతో తాగునీరు వదిలినప్పుడు ఈ రహదారిపై వృథాగా పారుతుండటంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై ఇటీవల మున్సిపల్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన వారు సోమవారం ఆ రెండు చోట్ల మరమ్మతు చేయించడంతో సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది.



‘ఉపాధి’ పనిదినాలు పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవాబుపేట: ఉపాధి హామీ పథకంలో పనిదినాలను రెండువందల రోజులకు పెంచాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి కోరారు. సోమవారం నాయకులతో కలిసి తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు వినతిపత్రం అందించారు. మహిళలకు ప్రసూతి నిమిత్తం రూ. 6 వేల చొప్పున పది నెలల పాటు చెల్లించాలన్నారు. పురుషులతో సమానంగా కూలీ అందేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా నిబంధనల ప్రకారం వెచ్చించాలని తెలిపారు. బహుజన మహిళలపై దాడులు అరికట్టాలని కోరారు. అదేవిధంగా వారిపై దాడులు చేసిన వారిని, చులకనగా చూసిన వారిని చట్టప్రకారం శిక్షించాలని కోరారు. ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డితో పాటు మండల స్థాయి అధికారుల వరకు అందరికి వినతిపత్రాలు ఇచ్చినట్లు వివరించారు.

‘ఆరు గ్యారంటీలు’ వెంటనే అమలు చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి

భూత్పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు వెంటనే అమలు చేయాలని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రూ. 2 లక్షల రుణమాఫీ త్వరగా చేయాలని, ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 9న రైతుబంధు వేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి నేటికి అమలు చేయలేదని అన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, వైస్‌ఎంపీపీ నరేష్ గౌడ్, విండో చైర్మన్ కదిరె అశోక్ రెడ్డి, ఎంపీడీఓ మున్నీ, మండల కోఆప్షన్ ఖాజ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక పూజలు



భక్తితో నమస్కరిస్తున్న యువతులు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు



జిల్లాకేంద్రంలో..



కందూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు



సుంకరామయ్యపల్లిలో..



జిల్లా కేంద్రంలో శివుడి ఆకారంలో దీపాలంకరణ



ప్రత్యేక అలంకరణలో శివుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు దేవాలయాల ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా జిల్లా కేంద్రం రవీంద్రనగర్‌లోని శ్రీపోచమ్మ దేవాలయంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. అదే విధంగా అంబా భవానీ దేవాలయంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయం అభివృద్ధికి తమవంతు సహకారం ఉంటుందన్నారు. భవసార్ క్షత్రియ సమాజం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానం చేశారు. జిల్లా కేంద్రంలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు.

అడ్డాకుల: మండలంలోని సుంకరామయ్యపల్లి గ్రామంలో సోమవారం రాత్రి గ్రామస్తులు కార్తీక పూజలు చేశారు. స్థానిక శివాలయంలో పూజలు చేసిన మహిళలు అక్కడే కార్తీక దీపాలను వెలిగించారు.

కందూర్‌లో భక్తుల రద్దీ

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు చేశారు. గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆవరణలోని కల్పవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

భక్తి కార్యక్రమాలతోపాటు సామాజిక సేవ



అయ్యప్ప మాలాధారులకు సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో భక్తి కార్యక్రమాలతోపాటు సామాజిక సేవ చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజు దేశ్‌పాండే గురుస్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని సోమవారం జిల్లా అధ్యక్షుడు సీమ నరేందర్ ఆధ్వర్యంలో వైభవంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. 18వ సారి అయ్యప్పమాల వేసుకున్న 25 మందిని వేదపండితులతో ఆశీర్వచనంతోపాటు ఘనంగా సత్కరించారు. గురుస్వాములు తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు: యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన క్రమంలో తిమ్మాసానిపల్లికి చెందిన వరద రవి, ప్రేమ్‌నగర్‌కు చెందిన ప్రశాంత్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో అయ్యప్పకొండపై 1,116 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్ప స్వామి పాలమూరు ప్రజలను చల్లగా చూడాలన్నారు. కాంగ్రెస్ నేతలు అమర్, ఆనంద్‌గౌడ్, రమేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సందీప్, రఘు తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

అలరించిన మెగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో భక్తిగీతాల ఆలాపన

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో మహబూబ్‌నగర్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన మెగా క్రిస్మస్ వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ వేడుకలకు గుర్తుగా క్రైస్తవ సోదరులు కొవ్వొత్తులను వెలిగించి ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన ఇమ్మాన్యుయేల్ మినిస్ట్రీస్ అధినేత రెవరెండ్ జెర్మియా క్రీస్తు సందేశం ఇచ్చారు. క్రీస్తు చూపించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. బైబిల్‌లోని పలు ఘట్టాలను చదివి వినిపించారు. వివిధ చర్చీల సంఘాల వారు భక్తిగీతాలు ఆలపించారు. వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేశారు. ఎంబీ చర్చి చైర్మన్ ఎస్.వరప్రసాద్, డాక్టర్ శామ్యూల్, డాక్టర్ రజనికాంత్, డాక్టర్ విజయ్‌కాంత్, పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ సుందర్‌పాల్, ప్రధాన కార్యదర్శి బీఎస్.పరంజ్యోతి, కోశాధికారి యేసుపాదం, పృథ్వీరాజ్, ఎఫ్రాం, ప్రకాశ్, జైపాల్‌తోపాటు అన్ని సంఘాల పాస్టర్లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అనాథ మృతి!

బాలానగర్: మండల కేంద్రంలోని ఓ వినాయక మండపం వద్ద పని చేసే గోపాల్ (35) ఆదివారం రాత్రి మృతిచెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కొంతకాలం క్రితం అనాథగా ఇక్కడకు వచ్చిన ఆయన మండల కేంద్రంలోని ఓ వినాయక మండపం వద్దే ఉండేవాడని అక్కడే పనిచేస్తూ స్థానికంగా ఉంటున్నట్లు వివరించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మండపం వద్దే మృతి చెందాడని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న తమ సిబ్బంది అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఘటనపై కే రాజు అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

16 నుంచి ఉత్సవాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం సమీపంలోని పిల్లలమర్రిలో హజ్రత్ సయ్యద్‌షా కమాల్ హుస్సేనీ చిస్తీ, సయ్యద్ షా జమాల్ హుస్సేనీ చిస్తీ రహెమతుల్లా అలై 648వ దర్గా ఉత్సవాలు ఈనెల 16 నుంచి ప్రారంభం కానున్నాయని ముతవల్లి షా మహ్మద్ ఫజల్‌ఖాన్ తెలిపారు. దర్గా ఆవరణలో ఉర్సు ఉత్సవాల పోస్టర్లను మౌలానా ఆలిండియా సున్నీ ఉల్‌మా మషాయక్ బోర్డు ప్రధాన కార్యదర్శి మొహిసిన్‌పాషా ఖాద్రీ, మౌలానా నాసిర్ మజహరి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బ్రహ్మయ్య ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ముతవల్లీ మాట్లాడుతూ 16న గుసుల్‌షరీఫ్ (జలాభిషేకం), 17న గంధోత్సవం, చాదర్ల సమర్పణ, ప్రత్యేక ఫాతేహాలు, 18న ముగింపు సందర్భంగా దీపారాధన (చిరాగే) వేడుకలు ఉంటాయని తెలిపారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, మతపెద్దలు పాల్గొంటారని తెలిపారు. అష్ఫాక్, ఖాజా ఖాన్, ఎండి.జహంగీర్, అయూబ్‌పాష, ఎండి.యాసిర్, బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ పలువురు సోమవారం జిల్లా కేంద్రంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డిని కలిసి విన్నవించారు. టైం స్కేల్, హెల్త్‌కార్డులు ఇప్పించాలని, మహిళలకు ప్రసూతి సెలవులు మంజూరు చేయించాలని, సమాన పనికి సమాన వేతనం, మరణించిన ఉద్యోగి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంతకు ముందే సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను మేనిఫెస్టో కమిటీకి ఇచ్చామని, టైం స్కేల్ ఇప్పించే విధంగా తనవంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. అనంతరం హర్షవర్ధన్‌రెడ్డిని ఉద్యోగులు సన్మానం చేశారు.